క్లుప్తంగా

ఎస్పీని కలిసిన టీఎన్‌జీఓస్ ప్రతినిధులు



ఎస్పీతో టీఎన్‌జీఓస్ మహిళా ప్రతినిధులు

కొత్తగూడెంటౌన్: టీఎన్‌జీఓస్ మహిళా ప్రతినిధులు జిల్లా జాయింట్ సెక్రటరీ జి.ఉష, శివనందిని ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న హరిప్రసాద్

కొత్తగూడెంటౌన్: రైటర్ బస్తీలోని శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో చిత్ర దర్శకుడు, న్యాయవాది బొమ్మ హరిప్రసాద్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ.. దుర్గ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నట్లు ఇది చేనేత ఫ్యామిలీకి సంబంధించిన యువకుడు తన జీవిత ఆశయాన్ని ఏ విధంగా నెరవేర్చుకుంటారనేది కథాంశమని తెలిపారు. ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మనం డాక్యుమెంటరీ, లవ్ యువర్ ఫ్యామిలీ, ప్రయత్నం, ట్రయాంగిల్ లవ్ స్టోరీ, మార్కెండేయ షార్ట్ ఫిలిమ్స్‌కు దర్శకత్వం వహించినట్లు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



బిచ్చు నాయక్, అధ్యక్షుడు



శాలేంరాజ్, సెక్రటరీ

జూలూరుపాడు: క్రైస్తవ హక్కుల పోరాట దళం (సీఆర్‌పీఎఫ్) మండల కమిటీ ఎన్నిక ఆదివారం జూలూరుపాడులో జరిగింది. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోరపుడి ఇసాక్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పాస్టర్ బిచ్చు నాయక్, సెక్రటరీగా పాస్టర్ శాలేంరాజ్, వైస్ ప్రెసిడెంట్‌గా పాస్టర్ తిమోతి, జాయింట్ సెక్రటరీగా ఫిలప్ ఎన్నికయ్యారు.

శ్రీరాములుకు నివాళి

ఇల్లెందురూరల్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుడు కోడి శ్రీరాములు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. పలు విప్లవ పార్టీలు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. చిరుప్రాయం నుంచి ఎర్రజెండా నీడలో ప్రయాణం చేసిన శ్రీరాములు ఎన్నో ప్రజల సమస్యలపై పాటలతో ప్రజలను చైతన్యపర్చారని గుర్తుచేశారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటు అన్నారు.

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత

- అప్‌గ్రేడ్ అమలులో జాప్యం
- ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు
- ప్రభుత్వం మారినా పట్టించుకోని అధికారులు



ఉల్వనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పాల్వంచరూరల్: ఆస్పత్రిలో వైద్యసిబ్బంది కొరత రోగులను వేధిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు. 24 గంటలు వైద్య సేవలు అందిస్తామని గత ప్రభుత్వ ఉన్నతాధికారులు హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. మారుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8 గంటలు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ 24 గంటలూ వైద్యసేవలు అందించాలని గత జూన్‌లో ఆదేశాలు జారీ చేశారు. 2023 జూలై 1 నుంచి అమలతుందన్నారు. కానీ అది అమలు కావడం లేదు. దీంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం 50 – 60 మంది ఓపీ ఉంటుంది. ఆస్పత్రి ఐదు హెల్త్ సబ్‌సెంటర్లు, 40 హ్యాబిటేషన్ గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. ఇద్దరు స్టాఫ్ నర్సులకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్‌గా డిప్యూటేషన్‌పై వచ్చిన శ్యామల ఇటీవల మంచిర్యాలకు బదిలీపై వెళ్లింది. దీంతో ప్రధాన ఎల్‌టీ లేక రక్త పరీక్షలు చేసేవారు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇద్దరు డాక్టర్లు ఉండాల్సిన ఆస్పత్రిలో ప్రస్తుతం డాక్టర్ తేజశ్రీ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో డాక్టర్‌తో పాటు ముగ్గురు ప్రధాన ఏఎన్‌ఎంల పోస్టుల్లో ఒక ఏఎన్‌ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా రెండు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో ద్వితీయ ఏఎన్‌ఎంలపై అదనపు పనిభారం పడుతోంది. ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులను సంవత్సరాల తరబడి భర్తీకి నోచుకోకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది..

వైద్యసిబ్బంది ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పట్టింది. శనివారం కేవలం ఐదుగురు రోగులు మాత్రమే ఆస్పత్రికి వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిరుపేదల వైద్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దిక్కు అయినప్పటికీ అరకొర వైద్య సిబ్బంది 24 గంటల వైద్యసేవలు అందించకపోవడంతో గిరిజన, గిరిజనేతర ప్రజలు, మండల కేంద్రమైన పాల్వంచలోని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికితోడు ఇప్పుడున్న సిబ్బంది కూడా స్థానికంగా ఉండడం లేదు. దూరప్రాంతాల నుంచి వస్తూ సమయపాలన పాటించకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బంది పడుతున్నారు.

వాహన సౌకర్యాలు లేక అవస్థలు...

ఏదైనా అత్యవసర చికిత్స కోసం ఉల్వనూరు దాని చుట్టుపక్కల గ్రామాల నుంచి మండల కేంద్రమైన పాల్వంచలోని ఆస్పత్రులకు రావాలంటే పగలు ఆటోలు అందుబాటులో ఉంటాయి. కానీ రాత్రయితే అవి కూడా ఉండవు. రాత్రి సమయాల్లో ఆస్పత్రులకు రావాలంటే నానతంటాలు పడుతున్నారు.

నిరాశ చెందుతున్న మండల ప్రజలు...

ఉల్వనూరు పీహెచ్‌సీలో ప్రస్తుతం ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్ ఉన్నారు. 24 గంటల వైద్యసేవలు అందించడానికి ఇద్దరు డాక్టర్లతోపాటు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, మరో ముగ్గురు స్వీపర్లను పెంచనున్నారు. అదేవిధంగా 24 గంటలు సేవలు అందించే విధంగా అప్పటి హెల్త్ డైరెక్టర్ 24గంటల వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓకు గతేడాది జూన్‌లో ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజలు ఆనందపడ్డారు. కానీ అది కార్యరూపం దాల్చకపోవడంతో గిరిజన ప్రజలు నిరాశ చెందుతున్నారు.

24 గంటలూ వైద్యం అందించాలి



ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందించాలి. ఏడాది క్రితమే ఆస్పత్రిని 24 గంటల వైద్యసేవలు అందించాలని అప్పటి హెల్త్ డైరెక్టర్ ద్వారా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. కానీ నేటికీ అమలు చేయడం లేదు.

– లక్ష్మి, లక్ష్మీదేవిపల్లి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఉల్వనూరు పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పరిధిలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆపద వస్తే పాల్వంచకు వెళ్లాలంటే ప్రాణాల మీదకు వస్తోంది.

– వాసం రుద్ర, ఉల్వనూరు

ప్రతిపాదనలు పంపించాం...

ఉల్వనూరులోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్, స్టాఫ్ నర్స్, ఎల్‌టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాము. పైనుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రతిరోజూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ తేజశ్రీ, ఉల్వనూరు పీహెచ్‌సీ

21న వనదేవతల జాతర



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: ఈ నెల 21వ తేదీ నుంచి వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జాతరను బొజ్జాయిగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జాతర నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మేడారం తరహాలో జాతరను ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని చెప్పారు. 21న సారలమ్మ, 22న సమ్మక్క గద్దెల మీదకు చేరుకుంటారని, 23న భక్తులకు దర్శనమిచ్చి 24న తిరిగి వనప్రవేశం చేస్తారని వివరించారు. వనదేవతలు గద్దెల మీదకు వచ్చే సందర్భంగా ఎటువంటి తొక్కిసలాట జరగకుండా ప్రత్యేకంగా రోప్‌పార్టీని స్థానిక యువకులతో ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, అత్యవసర వైద్య సేవల కోసం పోలీసు, గ్రామపంచాయతీ, వైద్యాధికారులు ఏటా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు గద్దెలను దర్శించుకున్న భక్తుల సంఖ్యను గమనిస్తే గతం కంటే అత్యధిక సంఖ్యలో భక్తులు జాతర సమయానికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జాతర నిర్వాహక కమిటీ ప్రతినిధులు కొర్స కోటయ్య, ఈశ్వరమ్మ, చీమల వెంకటేశ్వర్లు, సారయ్య, గౌతంరాజు, రామనాథం, ముత్తయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటాను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: మే 5న జరగనున్న నీట్ 2024కు హాజరు కానున్న ముస్లిం విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 10శాతం రిజర్వేషన్ సౌకార్యం ఉన్నందున ముస్లిం విద్యార్థులు వారి ప్రాంతంలోని మీసేవా కేంద్రాల్లో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా ఎంబీబీఎస్, డెంటల్, ఆయుష్, బీవీఎస్సీ-ఏహెచ్ సీట్లలో రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో భారీ దోపిడీ

ఇల్లెందు: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల్లో భారీ దోపిడీ జరిగిందని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన అనంతరం ఆయన ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారని విమర్శించారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించటంలోనూ అధికార పార్టీ నేతలకే అన్న సంకేతాలు ఇచ్చి పార్టీ కండువా కప్పుకున్న వారికే వర్తింపజేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు ప్రవేశపెడుతోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం పథకం ప్రవేశపెడితే అన్నివర్గాలు ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. రానున్న కాలంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలుతో బీఆర్‌ఎస్ గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. ఇక మహబూబాబాద్ ఎంపీ టికెట్ కోసం గట్టి పోటీ ఉందని, తనకు టికెట్ కేటాయిస్తే గెలిచి ఈ ప్రాంత ప్రజలకు సేవలందిస్తానని తెలిపారు.

పరామర్శ

పాల్వంచరూరల్: క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పాల్వంచకు చెందిన తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములను ఆదివారం ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు హైదరాబాద్‌లో పరామర్శించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

'వ్యాపారంలో న్యాయశాస్త్రం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: స్థానిక న్యాయవాది మహ్మద్ సాధిక్ పాషా రచించిన వ్యాపారంలో న్యాయశాస్త్రం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్‌లోని ప్రశాష్ పబ్లికేషన్ హౌస్, ముంబై ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ సుధాకర్‌రావు, ప్రపంచ ప్రఖ్యాత హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ మహ్మద్ మసూద్ అహ్మద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహ్మద్ సాధిక్‌పాషాను సన్మానించారు. ఈ సందర్భంగా సాధిక్‌పాషా మాట్లాడుతూ... వ్యాపారంలో న్యాయశాస్త్రం కార్పొరేట్‌లా ఎసెన్షియల్‌పై పట్టు సాధించడం అనే ఆంశంపై తాను రచించిన పుస్తకం వ్యాపార రంగంలో రాణించాలనుకునే యువతకు మార్గదర్శకాలు అందిస్తుందన్నారు. వ్యాపారంలో వచ్చే సమస్యలను చట్టబద్ధంగా ఎలా పరిష్కరించుకోవాలనే విషయాలను తెలియజేసినట్లు పేర్కొన్నారు. పుస్తకాన్ని పబ్లిష్ చేసేందుకు సహకరించిన ప్రశాష్ పబ్లికేషన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాము

పాల్వంచరూరల్: క్రీడలు మానసిక ఆనందాన్ని కలిగించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాయని పట్టణ ఎస్‌ఐ బాణాల రాము అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని నవభారత్ వద్ద ఆదివారం నవభారత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవభారత్ ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంతర్జాతీయ క్రీడ అయిన క్రికెట్‌లో ప్రతిభ చూపి రాణించే క్రీడకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఏ క్రీడలోనైనా ప్రతిభ చూపిన వారికి క్రీడల కోటాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రతీ క్రీడాకారుడు క్రమశిక్షణతో స్నేహ భావంతో క్రీడలను ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దినేష్, శశి, యాకేష్, హరి, నర్సి, క్రీడాకారులు బాల, చోటు, కౌశిక్, స్థానికులు మాలోతు కోటి, రాంబాబు, వీరన్న, సాధుశంకర్, వీరస్వామి, దాబా శంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

టేకులపల్లి: సింగరేణి సంస్థ పరిరక్షణ, మనుగడ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గుర్తింపు సంఘం పని చేస్తుందని బ్రాంచి కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం కోయగూడెం ఓసీలో జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, సంస్థ కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని కార్మికులు గుర్తించారన్నారు. గత సర్కారు సంఘాలను బుద్ధి చెప్పి సింగరేణి, కార్మికుల మనుగడను కాపాడే సంఘానికి కార్మికులు పట్టం కట్టారని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తామని పేర్కొన్నారు. నూతన భూగర్భ గనులు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామని, కార్మిక హక్కులను కాపాడుతామన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయిస్తామని చెప్పారు. బొగ్గు బావులను వేలం వేయించే విధానానికి స్వస్తి పలికే విధంగా పాలకులపై వత్తిడి తెస్తామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ గుర్తింపు సంఘానికి సహకారం అందించాలని కోరారు. ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపించిన కార్మిక వర్గానికి అయన కృతజ్ఞతలు తెలిపారు. తొలుత గుర్తింపు సంఘం విజయ పతాకాన్ని సీనియర్ ఎలక్ట్రీషియన్ కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోత్ కృష్ణ, గడ్డం అనంత శ్రీనివాస్, కాలే పుల్లయ్య, షిఫ్ట్ ఇన్‌చార్జ్‌లు మహ్మద్ షబ్బీర్, సామల శ్రీనివాస్, రామకృష్ణ చారి, వేంగళ రవి, ఎస్.ఐలయ్య, కనకరాజు, ఇబ్రహీం, పెరుగు భాస్కర్, మైఖేల్, పవన్ కుమార్, శ్రీరాములు, నవీన్ కుమార్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్, రవికుమార్, మహ్మద్ సలీం, బొటిక శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

'ఖేలో' భద్రాద్రి సంబురాలకు స్పందన



ప్రకాశం స్టేడియంలో సంబురాలు జరుపుకుంటున్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: గెజిటెడ్ – నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఈనెల 15,161,17వ తేదీల్లో నిర్వహించిన ఖేలో భద్రాద్రి సంబురాలకు విశేష స్పందన లభించిందని టీఎన్‌జీఓ జిల్లా జాయింట్ సెక్రటరీ జి.ఉష అన్నారు. ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రీడా పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఖేలో పోటీలను ప్రోత్సహించిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రోత్సహించిన జె.సోమయ్యకు, టీఎన్‌జీఓ అధ్యక్షుడు అమరనేని రామారావు, సాయి భార్గవ, చైతన్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాయి రితేష్, కే.సందీప్, జి.శివనందిని, పి.మధుసూదన్‌రావు, టి.రాహుల్, పి.ప్రకాష్, ఎం.కల్యాణి, పూర్ణ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే.. వేసవి తాపంతో జనం విలవిల

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- వేసవి రాక ముందే సూర్యుడి ప్రతాపం
- కూలర్లు, ఏసీల కొనుగోళ్లపై జనం దృష్టి




చెరుకు రసం తాగుతూ దాహర్తి తీర్చుకుంటున్న జనం

చుంచుపల్లి: శీతాకాలం వెళ్లకుండానే జిల్లా వాసులకు అప్పుడే వేసవి తాపం మొదలైంది. అసలు వేసవి కాలం రాకముందే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. జిల్లాలో ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు చేరువయ్యాయి. అన్ని ప్రాంతాల్లో వేడిగాలులు, ఉక్కపోతలు ముందుగానే షురూ అయ్యాయి. నాలుగైదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. శీతాకాలం వెళ్లిపోక ముందే వేసవితాపం మొదలైంది. వేసవి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం మార్చిలో నమోదు కావలసిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి మధ్యలోనే నమోదవుతున్నాయి. గడిచిన నాలుగైదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం 37 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు. మండు వేసవికి ముందే జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. అటు కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా గరిష్ట ఉష్ణోగ్రతలతో పోటీ పడుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 21 డిగ్రీలకు చేరాయి. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత మొదలవ్వటంతో ప్రజలు వేసవికాలం ఆరంభంలోనే ఉక్కిరి బిక్కిరవుతున్నారు. దీంతో సీజన్‌కు ముందుగానే కూలర్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు కొనుగోళ్లను ఆరంభించారు. అటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఇప్పటి నుంచే ఇళ్లలో రోజువారీ విద్యుత్ వాడకం పెరిగిందంటున్నారు. శివరాత్రి రాకముందే ఉష్ణోగ్రతలు పెరగడంతో అన్నివర్గాల ప్రజలు ఆరంభంలోనే ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బొగ్గుగనులకు నిలయంగా ఉన్న కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, పాల్వంచ ప్రాంతాల్లో ప్రతీ వేసవి సీజన్‌లో రాష్ట్రంలోనే ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదవుతుంటాయి. ఇక్కడ గతేడాది 49 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుత ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు చేరువ కావడంతో ఈసారి మండు వేసవిలో 50 డిగ్రీలు దాటి గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని పలువురు అంటున్నారు. వచ్చే మండు వేసవిని దృష్టిలో ఉంచుకొని శీతలపానీయాల దుకాణాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. వ్యాపారులు ఇప్పటికే కొబ్బరి బోండాలు, జ్యూస్ పాయింట్లు, పుచ్చకాయలు, చెరుకు రసం, పండ్ల రసాలు, సోడాలు వంటి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అటు ప్రజలు సైతం అప్పుడే శీతల పానీయాలను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. వచ్చే వేసవి సీజన్‌లో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు అప్పుడే చల్లని నేస్తాలను వెతుక్కునే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరు ఇళ్లల్లో కూలర్లు ఉన్నవారు వాటికి మరమ్మతులు చేసుకోవడం, రంగులు వేయడం ప్రారంభించారు. మరి కొందరు మార్కెట్లో కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీల కొనుగోళ్లు మొదలుపెట్టారు. స్థానికంగా తయారయ్యే కూలర్లు రూ.2 వేల నుంచి మోడళ్లను బట్టి రూ.8 వేల వరకు ధరల్లో అందుబాటులో ఉన్నాయి. ఇక రాజస్తాన్ కూలర్లు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. డబుల్ డెక్కర్ కూలర్లకు రూ.6 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు ఉన్నాయి. మోడళ్లు, మోటార్ సామర్థ్యం ఆధారంగా ఈ కూలర్ల ధర ఉంటుందని దుకాణ యజమానులు చెబుతున్నారు. పలు కంపెనీలు తయారు చేసిన రిఫ్రిజిరేటర్లు వివిధ మోడళ్లలో అందుబాటులో ఉన్నాయి. ఇందులో సైడ్‌డోర్, మల్టీ డోర్, డబుల్ డోర్, సింగిల్ డోర్ వంటి పలురకాల రిఫ్రిజిరేటర్లు ఉన్నాయి. కంపెనీతో పాటు మోడల్‌ను బట్టి వీటి ధర రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు ఉన్నాయి. అటు ఏసీలు కూడా మోడళ్లను బట్టి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ధరలు అందుబాటులో ఉంచారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఫిబ్రవరి నుంచే అమ్మకాలు ప్రారంభమయ్యాయని ఎలక్ట్రికల్ షాపుల యజమానులు చెబుతున్నారు.


మేడారం భక్తులకు సకల సదుపాయాలు

ఇల్లెందు: మేడారం మహా జాతరకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఇల్లెందు బస్టాండ్ నుంచి మేడారం జాతర బస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. జాతర టికెట్ స్టాల్ కౌంటర్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపీపీ చీమల నాగరత్నం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బస్‌లో కొద్ది దూరం ప్రయాణం చేసి సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్టాండ్‌లో మున్సిపల్, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో శానిటేషన్, మంచినీరు, వైద్యశిబిరం అందుబాటులో ఉంచాలని కోరారు. మేడారం జాతరకు ఇల్లెందు నుంచి 135 బస్ సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఖమ్మం బస్ డిపో మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం నుంచి బస్ సర్వీసుల రాకపోకలు ప్రారంభం అవుతాయని తెలిపారు. బస్‌లకు సరిపడా ప్రయాణికులు ఉంటే వెంటనే బస్ ఏర్పాటు చేస్తుంటామని చెప్పారు. ఖమ్మం డిపో బస్సులు ఇల్లెందు మీదుగా మేడారానికి 24 గంటల సర్వీసు ఉంటుందన్నారు. ఈసారి అన్ని బస్సులు గుండాల మీదుగా పస్ర వెళ్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందు డిపో అసిస్టెంట్ మేనేజర్ సంజీవరాణి, ఖమ్మం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, కండక్టర్ ఠాగూర్, డిపో కంప్యూటర్ అసిస్టెంట్ నాగరాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్, టీపీసీసీ సభ్యుడు ఎస్‌కె జాని, నాయకులు పింగళి నరేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, సుదర్శన్ కోరీ, తాటి భిక్షం, ముక్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మేడారానికి బస్ సర్వీసును ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో జెండా ఊపి బస్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల హామీల్లో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మేడారం జాతరకు కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతరకు వెళ్లే మహిళలు ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని పేర్కొన్నారు. డిపో మేనేజర్ బానాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈనెల 25 వరకు బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. టేకులపల్లి నుంచి మేడారం జాతరకు పెద్దలకు రూ.380, పిల్లలకు రూ.200 టికెట్ ధర నిర్ణయించటం జరిగిందని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ షేక్ సైదా రహూఫ్, నరసయ్య, భూమిక, రవి, హెల్త్ కమ్యూనిటీ సిబ్బంది వజ్జా పార్వతి, కల్తీ వెంకట రమణ, పూనెం చంద్రకళ, వాంకుడోత్ లక్ష్మి, రమేష్, పూనెం సురేందర్, ఉండేటి ప్రసాద్, గుడిపూడి కృష్ణయ్య, ఉదయ్, రెడ్యా నాయక్, సురేష్, నర్సింగ్ లక్ష్మయ్య, మూడు సంజయ్, బోడ మంగీలాల్, హనీఫ్, మధు రెడ్డి, పూన్యా, శివ, సతీష్, సర్దార్, అశోక్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందు: స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఫ్లోర్ లీడర్ నాగేశ్వరరావు పక్కన ఎమ్మెల్యే, చైర్మన్ డీవీ



టేకులపల్లి: బస్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య